విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 16, ఏప్రిల్ 2025

ఆర్మీలో రోబో వినియోగించేందుకు సరికొత్త కృత్రిమ మేధస్సు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : ఆర్మీలో రోబోలును వినియోగించేందుకు సరికొత్త కృత్రిమ మేధస్సును ఆవిష్కరిస్తున్నట్లు సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ రోబోటిక్స్ శాస్త్రవేత్త డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, రోబోటిక్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ఆటోమేషన్ రోబోటిక్ కృత్రిమ మేధస్సు అనుసంధానించి ప్రాముఖ్యత, సాంకేతిక పురోగతికి తోడ్పాటునందించే కృషి చేస్తున్నట్లు తెలిపారు. జీఏఐకి సాంకేతికతల ఆవిర్భావం, తయారీ, ఆరోగ్య సంరక్షణ విద్య ప్రమాణాల మెరుగు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డా.చొక్కా నాదం, కోఆర్డినేటర్ మహమ్మద్ పాల్గొన్నారు.

ఉపాధి భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి రూ.12 వేలు అందించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి

విశాలాంధ్ర-అనంతపురం: ఉపాధి భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి రూ.12 వేలు అందించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి గ్రామపంచాయతీ మరియు చిన్నంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 21 22 తేదీలలో బండ్లపల్లి నుండి అనంతపురం వరకు జరుగు పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వం పాల్గొంటున్నది. రెండవ రోజు అనంతపురం పట్టణంలో టవర్ క్లాక్ దగ్గర గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బహిరంగ సభ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకాలలో ఉన్న డిమాండ్లను బహిరంగ సభలో చర్చించడం జరుగుతుందన్నారు. పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు సాకే నాగరాజు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమైక్య రాష్ట్ర నాయకులు వైయల్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జనగణ,కుల గణన చేపట్టాలి..

విశాలాంధ్ర-అనంతపురం : ప్రభుత్వం జనగణ, కుల గణాలను చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. నారాయణస్వామి, ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... కులగణన చేపట్టడం ద్వారా ప్రభుత్వ పథకాలను అవసరమైన వర్గాలకు మెరుగ్గా చేరవేయడం సాధ్యమవుతుందన్నారు. ఈ కులగణన వల్ల సమాజంలో వనరులు ఏ స్థాయిలో వున్నాయో తెలియడంతో పాటు ఎవరిదగ్గర పోగుపడినాయో కూడా తెలుసుకోవచ్చు అని పేర్కొన్నారు. నిజంగా అసమానతలు వుంటే కులగణనతో మేలు జరుగుతుంది అని తెలిపారు.. కులగణనతో సామాజిక ప్రజాస్వామ్యం మెరుగు పడుతుందని పేర్కొన్నారు. కులగణన వల్ల సామాజిక పథకాలు ఏవర్గాలకు అవసరం ఏరకంగా వెనుకబడిన కులాలవారిని ఆదుకొనే పథకాలు చేపట్టాలి తదితర విషయాలపై ప్రభుత్వాలకు పూర్తి అవగాహన కల్పిస్తుందన్నారు. తదితర విషయాలపై ఈనెల 23న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో గోర్లు మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట్లపోతలయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగారు భాష, జిల్లా అధ్యక్షులు సి నాగప్ప, కల్లుగీత పనివాళ్ల సంఘం జిల్లా కార్యదర్శి రఘు, ఐలమ్మ కాలనీ కార్యదర్శి నాగరాజు, నగర అధ్యక్షులు పెయింటర్ భూషణ, జిల్లా సహాయ కార్యదర్శి ఆదినారాయణ ఎఐటియుసి నగర కార్యదర్శి వికె కృష్ణుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయండి

విశాలాంధ్ర-నార్పల : మండలంలోని భారీ ఈదురు గాలితో కూడిన వర్షం ధాటికి అగ్రికల్చర్, హార్టికల్చర్ పంటలు పండించిన రైతులు కు జరిగిన నష్టాన్ని అంచనా వేసి, నివేదికలు సిద్ధం చేయాలని వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశించారు. అలాగే విద్యుత్ సరఫరా స్తంభాలు, విద్యుత్ తీగలు గురించి జరిగిన సమస్యలపై విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి, ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు డామేజ్ అయి ఉంటే, లైన్లు తెగిపోయి ఉంటే కొత్త స్తంభాలు, విద్యుత్ లైన్లు పునరుద్ధరించి విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

జిల్లా జడ్జిని సన్మానించిన ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: బదిలీపై వెళ్తున్న అనంతపురం జిల్లా కోర్టు జిల్లా జడ్జి శ్రీనివాస్ ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ మంగళవారం సన్మానించారు. నగరం లోని స్థానిక కోర్టు రోడ్డు లో నున్న జిల్లా జడ్జి బంగ్లాకు ఎస్పీ వెళ్లి గౌరవంగా కలిశారు . జిల్లా జడ్జి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానం చేశారు. జిల్లా జడ్జిగా ఉత్తమ సేవలు అందించారని... జిల్లా పోలీసుశాఖ, జిల్లా న్యాయశాఖలు పరస్పర సహకారంతో ముందుకెళ్లి పనిచేయడం వల్ల బాధితులకు న్యాయం జరిగిందని వివరించారు. నిందితులకు శిక్షలు సందర్భాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఆటోబోల్తా పడి ఒకరు దుర్మరణం..

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: మండలంలోని కందుకూరు సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడి కందుకూరు గ్రామానికి చెందిన బోయ వెంకట్రాముడు మృతిచెందారు. స్థానికి ప్రభుత్వ ఆసుపత్రి లోని మార్చిలో ఉన్న వెంకట్రాముడు మృత దేహాన్ని బీసీ ఉద్యమ నాయకులు , న్యాయవాది చంద్రా చర్ల హరి సందర్శించి నివాళ లర్పించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సాయి సిద్ధార్థ కళాశాల విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-తాడిపత్రి : ఇంటర్మీడియట్ ఫలితాలలో పుట్లూరు రోడ్డులోని శ్రీ సాయి సిద్ధార్థ కళాశాల విద్యార్థిని ఆర్కాట్ మెహెక్ సుల్తానా స్టేట్ ఫస్ట్ సాధించి ప్రతిభ కనబరిచిందని ఆ కళాశాల డైరెక్టర్ ఎ.నాగభూషణ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఆర్కాట్ మెహెక్ సుల్తానా 992/1000 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. మెహెక్ సుల్తానా తండ్రి షామీర్ బాషా, పుట్లూరు మండలం, చాల వేముల ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్గా పనిచేస్తున్నారు. మెహెక్ సుల్తానా తల్లి కలీ మున్నీసా, పట్టణంలోని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మెహెక్ సుల్తానా బీటెక్ ఇంజినీరింగ్లో కంప్యూటర్ సైన్స్ విద్యనుభ్యసిస్తానని చెప్పింది. అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థిని, తల్లిదండ్రుల సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వి.రాజశేఖరరెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు.

అఖిల భారత కిసాన్ సభలో అనంతపురం నాయకులు...

విశాలాంధ్ర-శింగనమల: అఖిల భారత కిసాన్ 30వ మహాసభలు తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో జరుగుతున్న సందర్భంగా జాతీయరైతు సంఘం అగ్రగణ్యులుఅఖిల భారత రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ,అఖిలభారత రైతు ఉద్యమ రథసారథి రాకేష్ తికాయత్ ఏపీ రైతు సంఘం అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య రాష్ట్ర రైతుసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య జిల్లా రైతు సంఘం నాయకులు, జిల్లా రైతు సంఘం ప్రధానకార్యదర్శి చిరుతల మల్లికార్జున,జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఫెదార్ చిన్నప్ప యాదవ్ సత్యసాయి జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శి మహాదేవ, అనంతపురము జిల్లా రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు, రైతుసంఘము సీనీయర్ నాయకులు వై.సూర్యనారాయణరెడ్డి, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్, నరసింహులు, ఉమర్ తధితరులు పాల్గొన్నారు.

వైభోగం.. సీతా రామ కళ్యాణం

విశాలాంధ్ర-పామిడి : శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలని పురస్కరించుకొని పామిడి పట్టణంలోనీ పెన్నా నది ఒడ్డున మంగళవారం సాయంత్రం సీత రామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం చైత్ర మాసం నవమి తరువాత 9రోజులకు చేస్తారు పెన్నా నదిలో ఉన్న రామాలయంలో మోటార్ బాలన్న వంశస్థులు భక్తుల మధ్య సాయంత్రం 6.30గంటలకు అరిగేల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధనుంజయ, వెంకటేశ్వర్లు దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహారించారు.గొల్లపల్లి మహాదేవయ్య అర్చకత్వంలో జరిపారు. సీత రామ ప్రవరలు, కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం సీత లక్ష్మణ శ్రీరాముల వారి ప్రాకరోత్సవం చేశారు.

ప్లాస్టిక్పై సోదాలు.. మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-గుత్తి: మునిసిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ 120 మైక్రాన్ ప్లాస్టిక్ బ్యాన్ పై యుద్ధ ప్రాతిపదికన సోదాలు నిర్వహించాలని మునిసిపల్ శానిటేషన్ అధికారులకు, సచివాలయ శానిటేషన్ అధికారులకు మునిసిపల్ మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గుత్తి మునిసిపాలిటీని ప్లాస్టిక్ ఫ్రీ మునిసిపాలిటీగా ప్రకటించేలా పట్టణ వ్యాపారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పాత మునిసిపల్ కార్యాలయం నుండి కటిక బజారు, గాంధీ కూడలి గుంతకల్లు రోడ్డు, అనంతపురం రోడ్డు పరిసర ప్రాంతాల వద్ద గల వర్తక దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పించామని, 125 మైక్రాన్ కంటే ఎక్కువ బరువు కలిగినవి, రీ సైకిల్ అయ్యే వస్తువులు, జూట్ బ్యాజ్, క్యారీ బాగ్‌ల ద్వారా తమ వ్యాపార కార్యకలాపాలు సాగించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికళ్ళు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున, సచివాలయ సెక్రెటరీలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నివారణపై అవగాహన

విశాలాంధ్ర-అనంతపురం : అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమంలో భాగంగా అనంతపురంలోని పలు ప్రాంతాలలో ఏడిఎఫ్ఓ లింగమయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మొదటి టవర్ క్లాక్ సర్కిల్ లో ఎటువంటి పరికరాలు ఉపయోగించి అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు అని రకరకాల బ్రాంచి పైప్ ద్వారా డెమో నిర్వహించి నీటి ద్వారా ప్రదర్శన చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సకటముల ద్వారా రైల్వే స్టేషన్కి చేరుకొని అక్కడి సిబ్బందికి స్టేషన్ మాస్టర్ కి ఎలెక్ట్రికల్ ఫైర్ గ్యాస్ ఫైర్ జరిగినప్పుడు ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా ఏ విధంగా కాపాడవచ్చో అవగాహన కల్పించారు. ఆర్టిసి బస్సు డిపో డీజిల్ బంకుల్లో ఆయిల్ ఫైర్ జరిగిన మంటలు ప్రాథమిక స్థాయి లోనే ఉన్నప్పుడే డే డీసీపీ ఎక్సింగ్ విషర్ ద్వార మంటలను ఎలా అదుపు చేయాలో అని అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది కే.కృష్ణ కుమార్ ఎల్ఎఫ్, ఎస్.రమేష్ కుమార్‌రెడ్డి ఎల్ఎఫ్, ఈ.ఈరేష్ గౌడ్ డిఓపి, యూ. బాగా రెడ్డిఎఫ్ ఎం జీ.తిప్పేసామి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-యాడికి: గత సంవత్సర కాలంగా డీడీలు చెల్లించి ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ట్రాన్స్ ఫార్మర్లు బిగించకుండా కాలయాపన చేయడం తగదంటూ విద్యుత్ అధికారులకు మంగళవారం మండల రైతులు వినతిపత్రం అందజేశారు. పంట అదును దాటిపోతున్నా ట్రాన్స్ ఫార్మర్లు బిగించకుండా మెటీరియల్ లేదని సాకులు చెబుతూ కాలయాపన చేస్తుండడంతో విసుగు చెందిన రైతులు స్థానిక మండల టిడిపి నాయకులతో ఏపీ ట్రాన్స్ కో కార్యాలయానికి వచ్చారు. ఇన్చార్జి ఏఈ రాజారావు లేకపోవడంతో బిల్ కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. టీడీపీ మండల కన్వీనర్ రుద్రమ నాయుడు ఏఈ రాజారావుతో ఫోన్‌లో మాట్లాడారు. డీడీలు చెల్లించి సంవత్సరం దాటిన రైతులందరికీ వారంలోపు మెటీరియల్ తీసుకువచ్చి ట్రాన్స్ ఫార్మర్ అమర్చుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, ఐటిడిపి అధ్యక్షులు నరసింహ చౌదరి, తాండ్ర విక్రమ్, బీసీ సెల్ అధ్యక్షులు తీరం పురం నీలకంఠ, మధురాజు, హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తెలుగు యువత నాయకుడు, నీలకంఠారెడ్డి, రజక శేఖర్, వంకం నాగరాజు, పల్లా పురుషోత్తం, సుభాన్, పామిశెట్టి గోపి, చంద్ర, మధు, చెన్నారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బద్దెల రాముడు, వాసు, వెంకటేశు, బాలు, మహమ్మద్ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ముందస్తు అడ్మిషన్లు అడ్డుకోండి..
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓకు వినతి

డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: అనంతపురం జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రసాద్ బాబులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2025 - 26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఏప్రిల్ మాసంలోనే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు, విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న సేతుస్కూల్, నారాయణ శ్రీచైతన్య, భాష్యం లాంటి కార్పొరేట్ విద్యా సంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుస్తకాల పేరుతో ఒకటో నుంచి 5వ తరగతికి 10 వేల నుంచి 15 వేల వరకు పుస్తకాల వ్యాపారాన్ని ప్రైవేటు పాఠశాలలు చేస్తున్నాయని వివరించారు. ఈ విద్యా సంవత్సరం కొత్తగా విద్యార్థుల తల్లితండ్రుల ఇంటి వద్దకే జొమాటో రూపంలో పుస్తకాలు పంపిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ఒక బ్రాంచ్‌కు అనుమతి తీసుకొని ఐదు ఆరు బ్రాంచ్లు నడుపుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్షులు మంజునాథ్, నగర సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర

- పోలీసుల గట్టి బందోబస్తు
- ఊరంతా శోభాయానంగా బోనాలతో ఊరేగింపు

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: అనంతపురం రూరల్ మండల పరిధిలోని రుద్రంపేట గ్రామంలో వెలసిన పోతులయ్య స్వామి బోనాల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామ ఆచారం ప్రకారం గ్రామ పొలిమేరలో నూతనంగా పోతలయ్య స్వామి ఆలయ కట్టను నిర్మించిన సందర్భంగా గ్రామంలో బోనాల జాతరను నిర్వహించారు. మహిళలు ప్రత్యేక అలంకారణతో బోనాలను ఎత్తుకొని ఊరంతా ఉరుములు ,పోతురాజుల ఊరేగింపుతో బోనాలను తీసుకెళ్లారు. ఇంటింటా కన్నుల పండుగ ఈ బోనాలతో మహిళలు స్వామివారికి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వచ్చారు. అనంతరం పూతలయ్యకు మేకపోతును బలిగావుగా ఇచ్చిన అనంతరం గ్రామస్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. 20 ఏళ్ల తర్వాత పోతులప్ప బోనాల నిర్వహించడం చాలా సంతోషం గా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోతులయ్య జాతరలో డ్రోన్ కెమెరాలతో పోలీసుల నిఘా.... అనంతపురం రూరల్ గ్రామ పరిధి అయిన రుద్రంపేటలో నిర్వహించిన పోతులయ్య జాతరను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోతులయ్య జాతర సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కల్గకుండా చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా డ్రోన్ కెమేరాలు ఎగురవేసి పరిస్థితులు సమీక్షించుకుని ఎప్పటికప్పుడు స్థానిక 4వ పట్టణ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని కల్లుహొళ్ల గ్రామంలో సోమన్నగౌడ్ అనే వ్యక్తిపై ఆదివారం అర్ధరాత్రి పిడిబాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. 48 గంటలు గడవక ముందే బొమ్మనహాళ్ పోలీసులు కేసు ఛేదించి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిని మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నబిరసూల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓ మహిళతో 10 సంవత్సరాలు అక్రమ సంబంధం పెట్టుకోని అన్యాయం చేసి అమె మతిస్థిమితం కోల్పోయేందుకు కారణం కావడం గ్రామంలో పరువు తీశాడని అక్కసుతో అమె మేనల్లుడు గోవిందు సోమన్నగౌడ్పై కక్ష పెంచుకోన్నాడని అన్నారు. దీంతో గ్రామానికి చెందిన వన్నప్ప సహకారం తీసుకోని ఆదివారం ఇంటి ముందు నిద్రిస్తున్న సమయంలో పిడబాకుతో చంపేందుకు ప్రయత్నించాడు సోమన్నగౌడ్ కేకలు వేయడంతో పరారి అయ్యారు. మంగళవారం మండలంలోని నేమకల్లు గ్రామానికి వేళ్లే దారిలో గోవిందు. వన్నప్పలు ఉండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా 15 మంది విద్యార్థులకు గాయాలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: పాఠశాల విద్యార్థులను తరలిస్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మందికి పైగా విద్యార్థులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కానాపురం, కోత్తురు గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు డీ.హీరేహాల్ మండలం సోమలపురం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఒక ఆటోలో తరలిస్తున్నారు. మంగవారం మధ్యాహ్నం పాఠశాల నుండి స్వగ్రామాలకు తిరిగి వస్తున్న సమయంలో కానాపురం గ్రామ సమీపంలోని మలుపు వద్ద డ్రైవర్ చంద్ర నిర్లక్ష్యంతో ఆటో బోల్తా పడింది. శ్రీశాంత్, కావ్యశ్రీ, జయలత, భూమిక, గణేష్, హసెన్ కావేరిలతోపాటు మరో ఎనిమిది మంది విద్యార్థులు గాయాలు పాలైరు. దీంతో స్థానికులు గాయపడిన వారిని బళ్లారి విమ్స్కు తరలిం చారు. ప్రాణపాయం తప్పినట్లు తెలిపారు. చికిత్సలు పొందుతున్నా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

హెూమియో ఫిజీషియన్ రాష్ట్ర విభాగం

కోఆర్డినేటర్గా డాక్టర్ శాంతిప్రియ ఎంపిక

విశాలాంధ్ర-గుత్తి: అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన శాంతిప్రియ హాస్పిటల్ ఎండి డాక్టర్ శాంతి ప్రియకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూమియో ఫిజీషియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో అవకాశం దక్కింది. ఈనెల 13న గుంటూరులో జరిగిన అఖిలభారత హెూమియో వైద్యుల సంఘం 18వ రాష్ట్రస్థాయి సదస్సులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర విభాగం కోఆర్డినేటర్గా డాక్టర్ శాంతిప్రియను ఎంపిక చేశారు. మంగళవారం ఆమెకు పలువురు హెూమియో వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

జాతరకు హాజరైన తాడిపత్రి ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన నాగశేషు ప్రత్యేక ఆహ్వానం మేరకు మంగళవారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి జాతరకు హాజరయ్యారు. మండల నాయకులను పేరుపేరునా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, రామచంద్రారెడ్డి, నాగమణి రెడ్డి, త్రినాథ్ రెడ్డి, తెలుగు యువత నాయకుడు నీలకంఠారెడ్డి, నరసింహ చౌదరి పాల్గొన్నారు.

డీజీపీఎస్ నియోజకవర్గం అధ్యక్షుడిగా నాగేంద్ర

విశాలాంధ్ర-శింగనమల: దళిత గిరిజన ప్రజా సంఘం ప్రధాన కార్యాలయంలో మంగళవారం దళిత గిరిజన ప్రజా సంఘం శింగనమల నియోజకవర్గం అధ్యక్షులుగా కొర్రపాడు నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాకెట్ల చందు నాయక్ పత్రిక సమావేశంలో మాట్లాడుతూ గతంలో బుక్కరాసముద్రం మండల అధ్యక్షులుగా ఎన్నో ఉద్యమాలు చేసిన కొర్రపాడు నాగేంద్ర సమాజంలో జరుగుతున్న అసమానతలను రూపుమాపే విధంగా పోరాటాలు చేయాలని ఎలాంటి విపక్షత చూపించకుండా సమ సమాజ నిర్మాణం కోసం పాటుదాలని కోరారు. నియోజకవర్గం వ్యాప్తంగా దళిత గిరిజన ప్రజా సంఘం నిర్మాణం బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో దళిత గిరిజన ప్రజా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ నిజమ్ గిరిజన ఐక్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మూడ్ కేశవ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటిద్దాం ..

విశాలాంధ్ర-కణేకల్లు: ఉడేగోళం గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం అమలు అవుతున్న విధానాన్ని నేషనల్ వాష్ ఎక్స్పర్ట్ హిమాల్ రాజ్ సోలంకి పరిశీలించారు. గ్రామంలోని మురుగు నీటి పారుదల వ్యవస్థ, సురక్షిత త్రాగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలల మూత్రశాలలు ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగు దొడ్లు,చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం అమలు అవుతున్న విధానాన్ని అధికారులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా ఐఈసి కోఆర్డినేటర్ సునీత ఆర్డబ్ల్యూఎస్. డీఈ శ్రీనివాసులు, ఏఈ.శివ కృష్ణరెడ్డి, ఈఆర్డీ చంద్ర మౌళి, గ్రామ సర్పంచ్ లావణ్య టీడీపీ నాయకులు మారుతి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఇంజనీరింగ్ సహాయకులు. అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉద్యోగ విజయోత్సవం

విశాలాంధ్ర-నార్పల: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కంపెనీల ఆఫర్ లెటర్స్ అందజేసే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.డేవిడ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుండి సైంటిస్ట్ జి.రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మెకానికల్ ఎలక్ట్రికల్ విద్యార్థులు అందరికీ రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగాలు లభించినట్లు తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ అశోక్‌రామన్ పాల్గొన్నారు.

మొక్కుబడి తీర్చుకున్న ఎమ్మెల్యే కాల్వ

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని ఎం.హనుమాపురం గ్రామంలో ఎంతో మహత్యం కలిగిన వన్నూరు స్వామి తాతకు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు సార్వత్రిక ఎన్నికల్లో గెలవాలని టీడీపీ నాయకులు మొక్కుకొన్నారు. మంగళవారం గ్రామంలో వన్నూరు స్వామి తాత ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు వన్నూరు స్వామి తాత ఉరుసుకు హాజరయ్యారు. ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మొక్కులో భాగంగా స్వామివారికి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు బరువుకు తగ్గ చక్కెరను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమణల తొలగింపు..

విశాలాంధ్ర-రాప్తాడు : మండలంలోని రాప్తాడు గ్రామ పంచాయతీ మైనార్టీ కాలనీలో రహదారి అక్రమణలను పంచాయతీ అధికారులు మంగళవారం జేసీబీతో తొలగించారు. రోడ్డు మురుగు కాలువలు నిర్మించడానికి ఉపాధి హామీ పథకం కింద రూ.31,00,000 నిధుల మంజూరు అయ్యాయి. అయితే కొందరు రోడ్డు ఆక్రమించి ఇళ్లను కట్టుకున్నట్లు గుర్తించి జేసీతో వాటిని తొలగించారు.. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, పీఆర్ జెఈ భాస్కర్, సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎవరినీ ఉపేక్షించం

విశాలాంధ్ర - హిందూపురం : సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు మతాలు, వర్గాల మధ్య గొడవలు సృష్టించాలని చూస్తే ఎవరినీ ఉపేక్షించమని, రౌడీ షీటర్లను రౌడీషీటర్ల లాగే చూస్తామని హిందూపురం డీఎస్పి కేవీ మహేష్ వెల్లడించారు. మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సిఐలు రాజగోపాల్ నాయుడు, కరీం, ఆంజనేయులు, జనార్ధన్‌లతో కలిసి డీఎస్పీ మాట్లాడుతూ, ఈనెల 8న మధ్యాహ్నం 12.30 గంటలకు హిందూపురం టౌన్, ముద్దిరెడ్డిపల్లి నివాసి గోరవ మోహన్ తన స్వగ్రామం చెన్నేకొత్తపల్లి మండలం, న్యామద్దల గ్రామంలో మద్యం మత్తులో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి, తన మిత్రులకు వాట్సాప్‌లో పంపగా, సదరు వీడియో ఈనెల 11 తేది నుండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోందన్నారు. ఈ విషయంలో పోలీసులు ఈనెల 12న ఇతనిపైపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. ఈనెల 11న గోరవ మోహన్ చేసిన అనుచిత వ్యాఖల వీడియో వైరల్ అనంతరం, సదరు గోరవ మోహన్‌ను చంపాలనే ఉద్దేశ్యముతో ఈనెల 11న రాత్రి 10.00 గంటలకు అతను హిందూపురం టౌన్, బాలాజీ సర్కిల్‌లో ఉన్న హిడెన్ హాట్స్ రెస్టారెంట్‌లో ఉన్నది తెలుసుకొని సురేష్, సూరి ఇంకో నలుగురితో కలిసి, సూరి బీర్ బాటిల్‌తో విచాక్షనరహితంగా దాడి చేసి తలకు తీవ్ర రక్త గాయం చేసి దీనిని వీడియో చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసుకొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రాత్రి సురేష్, సూరి, శివకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్ చేశామన్నారు. అదే రోజు సాయంత్రం బోయ లోకేష్, నవీన్ కుమార్ మరికొందరు చేతిలో ఐరన్ రాడ్డుతో గోరవ మోహన్ బావమరిది ఇంట్లోకి అక్రమ ప్రవేశం చేసి గోరవ మోహన్ కనిపిస్తే చంపేస్తామని బెదిరించగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

పుట్టపర్తి మున్సిపాలిటీలో అవినీతి జలగలు

చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

విశాలాంధ్ర పుట్టపర్తి: పుట్టపర్తి మున్సిపాలిటీలో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయింది. మున్సిపల్ కమిషనరే కాకుండా కిందిస్థాయి అధికారులకు సైతం చెయ్యి తడపనిదే పనిచేసేలా లేరు. అనారోగ్యంతో బాధపడుతున్నా, దయాలసిస్ పేషెంటై ఉన్న, మంచానికి పరిమితై ఉన్నా, డోర్ నెంబర్, నేమ్ చేంజింగ్, బర్త్ సర్టిఫికెట్, టాక్స్ చెల్లింపు, బిల్డింగ్ అప్రూవల్స్ ఇలా ప్రతిదానికి మున్సిపల్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిందే. డబ్బు ఇవ్వనిదే పనులు సాగడంలేదు. ఈ నిర్లక్ష్యం ఎక్కడి నుంచి మొదలైందో కనిపెట్టాల్సింది ఉన్నతాధికారులే. మున్సిపల్ కమిషనర్ నుంచి కిందిస్థాయి ఉద్యోగి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. పుట్టపర్తి అంటేనే ఆధ్యాత్మికం. ఇలాంటి ప్రముఖమైన, పుణ్యస్థలంలో ఇలాంటి కార్యాలు చేయడం తగదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంపై ప్రముఖ పత్రికల్లో వరుస వార్తా కథనాలు ప్రచురితమవుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కింది స్థాయి ఉద్యోగి వసూళ్ల పర్వం....

మున్సిపల్ కార్యాలయంలో ఓ ఉద్యోగి వసూళ్లకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ప్రతి ఒక్కరి వద్ద నుంచి రూ.10 వేల నుంచి 30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ఎవరికి ఎంత వాటా పోతున్నాదో ఆ దేవుడికే తెలియాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ చలానాతో పాటు ఆ ఉద్యోగికి కూడా కప్పం కట్టాల్సి వస్తోందని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఒక మహిళ తన భర్తతో కలసి 8 నెలల నుంచి ఓ సమస్యపై తిరుగుతున్నా కుంటి సాకు చెప్పి పనిచేయడం లేదని బాధపడ్డారు.

ఈ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పుట్టపర్తి ప్రజలు ఉన్నారు. కమిషనర్ కి చెబుదామా అంటే చర్యలు తీసుకుంటారా అంటే జరిగే పరిస్థితి లేదు. ఎమ్మెల్యే కి చెబుదామా అంటే చిక్కే పరిస్థితి లేదు. ఇలా పుట్టపర్తి ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి పుట్టపర్తి మున్సిపాలిటీని ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

ఆర్వేటి ఆనంద్ దౌర్జన్యాలు తిప్పికొడతాం

విశాలాంధ్ర-ధర్మవరం: తాడిమర్రి మండలంలో ఆర్వేటి ఆనంద్ మత్స్యకార కుటుంబాలపై చేస్తున్న దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తక్షణమే మత్స్యకార కుటుంబాలకు ఆర్వేటి ఆనంద్ క్షమాపణ చెప్పాలని కురుబ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ నాయకులు కులాలు మతాల పేరుతో ప్రెస్ మీట్ లు పెట్టడం మంచి పద్ధతి కాదని తెలిపారు. అక్కడ జరిగిన వాస్తవాలను వెళ్లి మత్స్యకార కుటుంబాలను అడగాలని కురుబ సంఘం నేతలు హితవు పలికారు. ఆర్వేట్ ఆనంద్ తన అహంకారంతో దాదాపు 30 సంవత్సరములుగా పార్నపల్లి డ్యాం లో మత్స్యకార వృత్తిపై జీవిస్తున్న 520 కుటుంబాలపై దౌర్జన్యం చేస్తూ బిజెపి పెద్దల పేర్లు చెప్పుకొని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, వాటిని ఎదుర్కొన్నందుకే కులాలు మతాల పేరిట ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. మత్స్యకార వృత్తిలో ఉన్న మేము ఆర్వేటి ఆనంద్‌కు ఒక్క నయా పైసా కూడా ఇచ్చే ప్రసక్తేలేదని ఇది 520 మంది మత్స్యకార కుటుంబాలకు చెందిన ఆస్తిని దీనిలో ఏఒక్క నాయకునికి సంబంధం లేదన్నారు. తాడిమర్రి మండల టీడీపీ కన్వీనర్ కూచిరాముపై లేనిపోని అబాండాలు వేస్తున్నారని చెప్పారు. ఆనంద్ దౌర్జన్యాలను పూర్తిగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

బీజేపీలోకి పలువురి చేరిక..

విశాలాంధ్ర-ధర్మవరం: మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన గడుపుటి నాగభూషణం ఆధ్వర్యంలో, ధర్మపురి మాజీ సర్పంచ్ వెంకటరాముడు, మాజీ సర్పంచ్ పులమరాజుల వారి అనుచరులతో కలిసి మంగళవారం బీజేపీలో చేరారు. వీరికి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పార్టీ కండువా కప్పి గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బలమైన నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఇందుకు ఆకర్షితులై గడుపుటి నాగభూషణం, వెంకటరాముడు, పులమరాజులు తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరడం ఎంతో హర్షదాయకమని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, రూరల్ మాజీ అధ్యక్షులు భక్తవత్సలా నాయుడు, నేలకోట రామ్మోహన్, మైనార్టీ నాయకులు నబి రసూల్, బోయ చిన్న లింగమయ్య, బోయ గంగాధర్, పోతుకుంట రాజు, ఏకిల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఏఐటీయూసీ నాయకుడు మృతికి సిపిఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర-పెనుకొండ : మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో నివాసము ఉన్న ఏఐటియుసి సభ్యుడు కామ్రేడ్ ఓబులేసు, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తుది శ్వాస విడిచారు, ఈ సందర్భంగా సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు నేతృతంలో ఓబులేసు భౌతికయానికి నివాళులర్పించి ఏఐటియుసి జెండాను కప్పి పూలమాలతో నివాళులర్పించారు, అనంతరం ఓబులేసు చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు,ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మున్సిపల్ యూనియన్ నాయకుడు కరణ్, మున్సిపల్ కార్మికులు మహిళా కార్మికులు ఏఐటీయూసీ భవన కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి ..

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హుందాయి ట్రాన్సిస్, కియా అనుబంధ కంపెనీ వారు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.25 లకలు వెచ్చించి కంప్యూటర్ సెంటర్‌ను స్టడీ అవర్స్‌కు పిల్లలకు అవసరమైన సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు, అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 10 లక్షలు వెచ్చించి కొంత ప్రహరీ గోడ, లైబ్రరీ, పిల్లలకు త్రాగడానికి మంచినీటి పైప్లైన్, 2 బీరువాలు పాఠశాలకు 4 రూములకు గ్రిల్ ఏర్పాటు చేశారు. పిల్లలకు అవసరమైన ప్లేటు, గ్లాసుల, తినుబండారాలు చాక్లెట్లు బిస్కెట్లు ఒక కిట్టుగా తయారు చేసి పంపిణీ చేశారు, హుందాయి ట్రాన్సిస్ కంపెనీ, ప్రతినిధులు యోన్‌సాంగ్, ధూమ్ ఇమ్ కిమ్, మాట్లాడుతూ, ముఖ్యంగా విద్యకు చేయూతనిచ్చే అవకాశం రావడం పట్ల ధన్యులం అవుతున్నామని తెలిపారు. అనంతరం వారిని కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ సిబ్బంది ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పద్మప్రియ పాల్గొన్నారు.

మండల సర్వసభ సమావేశం వాయిదా

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో నరేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక మళ్లీ వాయిదా పడింది, మండలంలో 22 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా మూకుమ్మడిగా ఎంపీపీతో పాటు జడ్పీటీసీ సభ్యులు మిగిలిన ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. అయితే 15 వ ఆర్థిక సంఘం నిధులు మండలానికి 85 లక్షలు విడుదల అయినా ఎంపీటీసీలకు పనులు ఇవ్వకపోవడంతో నిరుత్సాహంతో రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి,

ఉపాధి పనులపై రాజకీయ జోక్యాన్ని నివారించాలి

▶ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరప్ప

విశాలాంధ్ర-తనకల్లు : ఉపాధి హామీ చట్టం పారదర్శకంగా అమలు చేయడం కోసం రాజకీయ నాయకుల జోక్యాన్ని పూర్తిగా నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరప్ప కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి కూలీలతో నిరసన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో ఏపీవోలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న పది వారాల బిల్లులు వెంటనే కూలీలకు అందించాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 100 నుండి 200 రోజులకు పెంచాలన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కూలి రేట్లు 700 రూపాయలకు పెంచి కూలీల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు మండలంలో పనులు కల్పించి వలస పోయిన వారందరినీ తిరిగి గ్రామాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు మౌలిక వసతులతో పాటు ఏవైనా ఆపదలు కలిగినప్పుడు ప్రభుత్వమే ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రతి కూలికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తనకల్లు మండల కన్వీనర్ రెడ్డప్ప, ఆనందు, రవి, రవి నాయక్‌తో పాటు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యూవల్ చేయాలి

సిపిఐ మండల కార్యదర్శి చెల్లా శ్రీనివాసులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: రైతుల నుంచి కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని వారి బంగారు రుణాలను రెన్యువల్ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేస్తూ మంగళ వారం ముదిగుబ్బలోని వివిధ బ్యాంకు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు వారు బంగారు రుణాల మొత్తం రుణం చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని డిమాండ్ చేస్తుండడంతో రుణ గ్రహీతలు రైతన్నలు దిక్కుతోచన స్థితికి లోనవుతున్నారని ఆవేదన చెందారు. కొన్నేళ్ళుగా పంటలు పండగ కనీస పెట్టుబడులు కూడా దక్కక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో బ్యాంకు అధికారులు గోరుచుట్టుపై రోకలి పోటులా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు, దీంతో బ్యాంకు అధికారులు మాపై అధికారుల ఆదేశాల మేరకే ఇలా చేస్తున్నామని చెప్పడంతో సిపిఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇది ఇలాగే కొనసాగితే త్వరలోనే మండలంలోని రైతన్నలతో కలిసి బ్యాంకుల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు, సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు సమస్యను ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులతో అక్కడి కక్కడే ఫోన్లో విన్నవించగా యూనియన్ బ్యాంకు జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తూ ఈసమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, రైతు సంఘం నాయకులు గంగిరెడ్డిపల్లినాయుడు, స్థానిక నాయకులు ఆదెబ్బ, తుమ్మల చిన్నప్ప, రాధాకృష్ణ, శంకర, ముత్తులూరి మధు, లింగుట్ల వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని సంజయ్ నగర్ లో గల అగ్నిమాపక కార్యాలయంలో ఈనెల 15వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అగ్నిమాపక అధికారి యు.రాజు మాట్లాడుతూ మొదటి రోజు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్లో అగ్నివిప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వాటర్ డెమో ద్వారా చేసి చూపించారు. కరపత్రాలను కూడా ప్రజలకు పంపిణీ చేశారు. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు అగ్గిపెట్లు, లైటర్లు, టపాకాయలు, ఎలక్ట్రికల్ సామాగ్రి, ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచరాదని తెలిపారు. అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలకు ముందుగానే కొంత నీటిని మీ ఇంటిలో నిల్వ చేసుకోవాలని తెలిపారు. ఇంట్లో వంటింటి క్రింద పై భాగాలలో గాలి, వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలని, సిలిండర్ విషయంలో తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ లీక్ అవుతున్నట్లు మీకు తెలిసిన వెంటనే రెగ్యులేటర్లను తప్పక ఆపివేయాలని తెలిపారు. వంట చేసేటప్పుడు నూలు బట్టలు ఏప్రాన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ప్రమాదవశాత్తు మీ బట్టలకు నిప్పు అంటుకుంటే భయంతో పరిగెత్తవద్దని, నేలపై దొర్లి, దుప్పటి లేదా కోటు లేదా పెద్ద టవల్ను చుట్టుకోండి అని తెలిపారు. విద్యుత్ పరికరాలకు నిప్పంటుకున్నప్పుడు నీళ్లతో ఆర్పవద్దని దీనివల్ల కరెంటు షాక్‌కు తగిలి ప్రాణాపాయం కలగవచ్చునని తెలిపారు. అలా కాకుండా వెంటనే కరెంటు ఆఫ్ చేయాలని తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పట్టణ అగ్నిమాపక కేంద్రానికి గాని 101 కు సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ అగ్నిమాపక వారోత్సవాలు 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్‌లో సాయియేసు విద్యార్థి

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రముఖ శ్రీ సాయి యేసు ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న ఎం.మహిమా న్విత్ ఇన్స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోల్లో ఎక్కువ మంది వ్యక్తులలో(1046) గంటలో పియానో వాయిద్యం వాయించి వీడియోలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నాడు. ఈ మేరకు హైస్కూల్ కరస్పాండెంట్ ఎల్.భాస్కర్, అధ్యక్షురాలు ఎల్.రాధ, తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎం.ముత్యాలప్ప (ఉపాధ్యాయుడు, టేకులోడు), తల్లి ఎం. మెర్సీ రాణి ఉపాధ్యాయుల బృందం ఆనందం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని సానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఏనుములపల్లి వారపు సంతలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్ కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పుగలుగుతుందని వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించిన అమ్మినా భారీ జరిమానాలు విధించి క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్‌కుమార్, ఉమాశంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండకమర్లలో కార్డెన్ సెర్చ్..

విశాలాంధ్ర-ఓడిసి రూరల్ : ఎసీ ఆదేశాల మేరకు నల్లమడ సర్కిల్, ఓడిసి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండకమర్ల గ్రామంలో మంగళవారం నల్లమాడ సిఐ నరేందర్ రెడ్డి, ఒడిసి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ సిబ్బందితో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాత ఎక్సైజ్ నేరస్తుల ఇండ్లలో చెక్ చేశారు. అనుమానితుల ఇండ్లలో కూడా తనిఖీ చేయడం జరిగింది, రౌడీ సస్పెక్ట్ లాంటి బాడ్ క్యారెక్టర్స్‌కి కౌన్సిలింగ్ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో మీటింగ్ ఏర్పాటు చేశారు. కొండకమర్లలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున అందరూ షాపుల ముందర ఎలాంటి వెహికల్స్ రోడ్డు లో పెట్టకుండా సహకరించాలని తెలిపారు.

కన్నా వెంకటేష్‌కు జాతీయ పురస్కారం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణానికి చెందిన రజిని ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ వ్యవస్థాపకులు కన్నా వెంకటేష్‌కు విజయవాడ సిద్ధార్థ కాలేజ్ ఆడిటోరియంలో జన సేవా సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ 134జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా సమాజానికి సేవలు అందిస్తున్న సేవకులను గుర్తించి, అవార్డులతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా మాజీ కేంద్రమంత్రి విజయవాడ ఎమ్మెల్యే సుజనాచౌదరి, మాజీ మంత్రి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసులు చేతుల మీదుగా కన్నా వెంకటేష్ జాతీయ ఉత్తమ సేవారత్న పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు ఆదిశేషుకు, జన సేవా సొసైటీ వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ జాతీయ పురస్కారం మరింత బాధ్యత పెరిగిందని, రజనీ ట్రస్టు, రక్త బంధం ట్రస్టు సభ్యులందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

19న బొమ్మసానిపల్లి క్రికెట్ లీగ్ టోర్నీ..

విశాలాంధ్ర-అగళి : ఈనెల 19,20 తేదీల్లో బొమ్మసానిపల్లి క్రికెట్ లీగ్ టోర్నమెంట్ (సీజన్ 1)నిర్వహిస్తునట్లు కన్వీనర్ లు తిప్పేష్ ఆరాధ్య ధను తెలిపారు. బొమ్మసానిపల్లి గ్రామంలోని క్రీడామైదానంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు మండలం నుంచి 8 జట్లు పాల్గొంటాయన్నారు. ఎస్‌బిఐ మొదటి బహుమతి కింద రూ.50 వేల ట్రోఫీని అందించనుండగా అదే గ్రామానికి చెందిన హరీష్, మహేష్‌లు ద్వితీయ బహుమతి కింద రూ.30 వేలు అందించనున్నారు. రఘు షామియానా సమాకూర్చగా నరసింహరాజు క్రికెట్ కిట్‌ను అందించనున్నారు. 9741249043, 9900772478 నంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయ మహాసభల్లో జిల్లా నాయకులు..

విశాలాంధ్ర-కనగానపల్లి : తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఏప్రిల్ 15.16.17 నిర్వహించబడుతున్న రైతు సంఘం 30వ జాతీయ మహాసభల్లో శ్రీసత్యసాయి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నగిరి కాటమయ్య, అనంతపురం జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లాసహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సత్యసాయి జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్, రైతు సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, వెంకట్ రాముడు, సెట్టూరు నరసింహులు, అనంతపురం జిల్లా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పీట్ల రామకృష్ణ, సింగనమల నియోజవర్గం రైతు సంఘం నాయకులు నారాయణస్వామి, అనంతపురం రూరల్ మండలం కార్యదర్శి మేకల రమేష్, అనంతపూర్ రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్ ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు బెల్లం మహదేవ ఒక ప్రకటనలో తెలియజేశారు.

వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ ప్రధాన కార్యదర్శిగా సురేష్ రెడ్డి..

విశాలాంధ్ర-ధర్మవరం : వైసీపీ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అప్పి రెడ్డి గారి సురేష్ రెడ్డిను పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా పలు ఆ పార్టీ నాయకులు సురేష్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తారని, పార్టీ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

పది పరీక్షల్లో ఫెయిల్ అవుతానని ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం : పదవ తరగతి పరీక్షల్లో తాను ఫెయిల్ అవుతానని భ్రమపడి, తీవ్ర ఒత్తిడికి గురై సాకే వైష్ణవి అనే విద్యార్థిని (15) ఇంట్లో ఎవరూ లేని సమయాన చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు.. సాకే వైష్ణవి పట్టణంలోని మోడల్ హైస్కూల్లో పదవ తరగతి పరీక్షలను రాసింది. వైష్ణవి మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో తన తల్లిదండ్రులతో ఉండేది. తాను పరీక్షలు బాగా రాయలేదని, ఫెయిల్ అవుతానని తల్లిదండ్రులతో చెప్పుకుంటూ బాధపడుతున్నది. తల్లిదండ్రులు ధైర్యం చెప్పి కాలం గడుపుతూ వచ్చారు. సాకే వైష్ణవి తండ్రి కృష్ణయ్య మగ్గం పని, తల్లి ధనలక్ష్మి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం ఉదయం తండ్రి ఓ పనిమీద బయటకు వెళ్ళగా, తల్లి కూలి పనికి వెళ్ళింది అని, ఇదే అదునుగా చేసుకొని ఇంట్లో ఎవరూ లేని సమయాన మేడపైన గల కిటికీకు చీరతో ఉరివేసుకొని చనిపోయింది అని తెలిపారు. గమనించిన తండ్రి పక్క ఇంట్లో నుంచి ఎంతసేపటికి తలుపు తీయలేకపోవడంతో, కిటికీ నుంచి చూడగా బిడ్డ చీరకు వేలాడుతూ ఉంది. స్థానికుల సహాయంతో సాకే వైష్ణవిని కిందకు దించి, హుటా హుటిన ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు గమనించి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. రూరల్ ఎస్సై శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బీసీఏ కోర్సును సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల నందు 2025-26విద్యా సంవత్సరం నుండి బీసీఏ కోర్సును ప్రారంభిస్తున్నామని కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీప్రపంచంలో బిటెక్ చేసిన విద్యార్థులతో సమానంగా బిసిఏ విద్యార్థులకు అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ఎంపీసీ, బైపీసీ, ఎమ్మీసీ, సియిసి, హెచ్చిసి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ కోర్సును సద్వినియోగం కోరారు.

అభివృద్ధి ఆలోచన చేయండి...

తాడిమర్రి, విశాలాంధ్ర : కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ఉన్నారని వైసీపీ యూత్ కన్వీనర్ సిద్దే మోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని అధికార పగ్గాలు చేపట్టాక అభివృద్ధిని మరచి అక్రమ సంపాదన కోసం ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని కొట్టుకునే వరకు వచ్చారని అన్నారు. మండలంలో కూటమి నాయకుల ప్రవర్తన చూస్తే దొంగలు దొంగలు ఊర్లు పంచుకునేలా ఉందని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం తో పాటు మరెన్నో పథకాలు అమలు చేస్తామన్న ప్రభుత్వం మాట తప్పి మహిళలను నిండా ముంచారని అన్నారు. మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఇప్పటివరకు రైతులకు ఒక్క పైసా కూడా ఇచ్చిన దాఖలాలు కనిపించలేదని అన్నారు గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనంతపురం ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి చొరవతో పీఏబీఆర్ కుడికాలువ ద్వారా మండలంలోని అన్ని చెరువులను నింపి రైతుల కళ్ళలో ఆనందం నింపామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్క చెరువుకైనా చుక్కనీరు వదిలారా అని అన్నారు.

మరో డీలర్ వద్ద రేషన్ సరుకులు తీసుకునేలా అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర, గోరంట్ల : మండలంలోని వెంకటరమణ పల్లి గ్రామంలో గల ప్రభుత్వ చౌక ధాన్యపు డిపో 46 కాకుండా మరో రేషన్ డీలర్ వద్ద రేషన్ సరుకులు తీసుకునేలా అవకాశం కల్పించాలని వెంకటరమణ పల్లిలోని ఒక వర్గానికి చెందిన కొందరు రేషన్ కార్డు లబ్ధిదారులు మంగళవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వం మారిన తర్వాత ఒక వర్గానికి చెందిన వ్యక్తికి రేషన్ షాప్ డీలర్‌గా మార్చడంతో కొంత కాలంగా అతనికి, మాకు వ్యక్తిగత కక్షలు ఉన్నాయని, మేము 8 నెలలుగా మేము శెట్టి చిన్నంపల్లి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నామనీ తెలిపారు. 3 నెలలుగా బఫర్ సమస్యతో ఎక్కడ కార్డు ఉంటే అక్కడే రేషన్ సరుకులు తీసుకోవాలని డీలర్ మాకు వెనక్కు పంపారని, దీంతో మరో చోట తీసుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. తహసిల్దార్ మారుతి మాట్లాడుతూ విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సత్యసాయి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి బండి వేణుగోపాల్, భార్య లక్ష్మీదేవి దంపతులు మంగళవారం తమ వంతుగా రూ.25 వేలు విరాళంగా ఆలయ కమిటీ అధ్యక్షులు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య, డైరెక్టర్ సూర్య ప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు దంపతుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, వారిని ఘనంగా సత్కరించారు.

ఎస్సీ కార్పోరేషన్ రుణాలు కోసం ఆహ్వానం

విశాలాంధ్ర,అమరాపురం.. మండలంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఆర్థిక రుణాలు పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ గణేష్ కోరారు. నేటి నుంచి మే నెల 10 వ తేది వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చునని తెలిపారు. కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని, లబ్ధిదారుడు ఆంధ్రప్రదేశ్‌కు చెంది ఉండాలి. వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్లు కలిగి ఉండి దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) కేటగిరీ కింద ఉండాలన్నారు. లబ్ధిదారునికి జనరిక్ ఫార్మసీ పథకాలకు డి.ఫార్మసీ/ బి.ఫార్మసీ/ ఎం.ఫార్మసీ ఉండాలని సూచించారు.

మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - గుంతకల్లు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారానికి 90 గంటలు పని పెట్టాలని ప్రయత్నిస్తున్నారు దీన్ని సిఐటీయు గా తీవ్రంగా ఖండిస్తున్నాం. మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సిఐటీయు జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నాగేంద్ర, పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ, మేడే కార్మికుల దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని బ్రిటిష్ కాలం నుండి సాధించుకున్న ఎనిమిది గంటలు పనీ దినాన్ని కాపాడుకుందాంనీ అన్నారు పెద్దపెద్ద కంపెనీ అధినేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారానికి 90 గంటలు పని దినాలు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు దీనిని తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున మేడే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది. అలాగే లేబర్ కోడ్ లు కార్మికులకు ఉరితాడులా మారాయి లేబర్ కోడ్ ల వల్ల ప్రశ్నించే హక్కు కోల్పోయి. కార్మికులకు రావలసిన బెనిఫిట్ అడిగే హక్కు కూడా ఉండదు. అసలు యూనియన్ ఏర్పాటు చేసుకునే పరిస్థితి ఉండదు కార్మికులకు యాజమానుకు

అధికారులకు, ప్రభుత్వాలకు పూర్తిగా కట్టు బానిసలుగా మారే పరిస్థితి ఉంది, అందుకే కార్మికులు మే 20 తారీకున జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని లేబర్ కోడ్ ని రద్దు చేయాలని పార్లమెంట్ దద్దరించేలా సమ్మె చేయాలని మోడీ దిగరావాలని లేదంటే ఆయన మెదలు పంచైనా లేబర్ కూడా రద్దు చేసే వరకు ప్రాణాలు తెగించి పోరాడుతామని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించడం జరిగింది. అలాగే అంగన్వాడి వర్కర్స్కు ఫేస్ ఆఫ్ వెంటనే రద్దు చేయాలని అన్ని యాప్ రద్దుచేసి ఒక యాప్ ఏర్పాటు చేయాలని, ఆశా వర్కర్లు పని ఒత్తిడి తగ్గించాలని, గుంటకల్ జనాభా పెరిగింది, అదనంగా ఆశ వర్కర్లను తీసుకోవాలని. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని. ఆటో కార్మికులకు వాహన మిత్ర సంవత్సరానికి 15000 లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని. ఔట్సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆప్కాస్ రద్దు చేసి వెంటనే పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ పద్ధతి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్రలపై పెద్ద ఎత్తున సిఐటీయు ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. అంగన్వాడీ యూనియన్ రేష్మ, గంగా, శైలజ, ఆశ యూనియన్ పరిమళ, రాంకీ మహిళలు రంగమ్మ, విద్యుత్ రంగం ఎస్కేమ్ భాష,రాము, మున్సిపాలిటీ నాయకులు, సురేష్, సామెల్ ఆటో యూనియన్ హరి, గోపాల్, భవన నిర్మాణ కార్మికులు జాకీర్, హమాలీ యూనియన్ రాము, శంకర్ రైల్వే యూనియన్ సుధాకర్, చిన్న వ్యాపారస్తులు సంఘం హాజీ భవనిర్మాణ కార్మిక సంఘం జాకీర్, కార్ స్టాండ్ రామంజి. తదితరులు యూనియన్లు నాయకులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకమైన కందుకూరు వీరేశలింగం పంతులు అవార్డ్కు ఎంపికైన రంగస్థల కళాకారుడు, లలిత కళాపరిషత్ సహాయ కార్యదర్శి వాల్మీకి కుళ్లాయప్ప ప్రముఖ సంఘ సంస్కర్త, తెలుగు నాటక పితామహుడు శ్రీ కందుకూరు వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహంచే అవార్డులకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి ఎంపిక అయిన పది మంది కళాకారులలో వాల్మీకి కుళ్లాయప్ప ఎంపిక కావడం జరిగింది. వాల్మీకి కుళ్లాయప్ప గత 30సంవత్సరముల నుండి పౌరాణిక నాటక రంగంలో కళా సేవలందిస్తూ తెలుగు నాటక కళామ తల్లి ముద్దు బిడ్డగా వివిధ పాత్రలను తనదైన శైలిలో పోషిస్తున్నాడు. పాన్పు సీనులో శ్రీకృష్ణునిగా, దుర్యోధనునిగా మయసభ నుండి రాయబారం వరకు, రాయబారంలో ధృతరాష్ట్ర పాత్రలోను, ఉపప్లావ్యములో ధర్మరాజుగాను, గయోపాఖ్యానంలో ధర్మరాజు గను, శ్రీ రామాంజనేయ యుద్ధంలో విశ్వామిత్రుడు గను, సుగ్రీవుడు గను,శ్రీసత్యహరిశ్చంద్ర నాటకం లో విశ్వామిత్రుడు గను, శ్రీ వీరబ్రహ్మేంద్ర నాటకం నందు గ్రామ మునసబు గను దాదాపు 215 నాటక ప్రదర్శనలు చేయడం జరిగింది. జిల్లా స్థాయిలో ఎంపికైన కళాకారులకు రూ.10000/-తో పాటు విశిష్ట పురస్కారాలను 16-4-2025 తేది విజయవాడ శ్రీ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు శ్రీ కందుల దుర్గేష్ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సత్కరించడం జరుగుతుంది. వాల్మీకి కుళ్లాయప్ప అయిన నన్ను అవార్డ్ కు ఎంపిక చేసిన ఎంపిక కమిటీలో ఒకరైన లలిత కళాపరిషత్ కార్యదర్శి శ్రీమతి పద్మజమ్మకి, అందుకు సహకరించిన మిగతా కమిటీ సభ్యులకు, నాటక అకాడమీ చైర్మన్ శ్రీగుమ్మడి గోపాలకృష్ణకి ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి కుళ్లాయప్ప
రంగస్థల కళాకారుడు
సహాయ కార్యదర్శి
లలిత కళాపరిషత్, అనంతపురం

శివాలయ నిర్మాణమునకు బండి వేణుగోపాల్ దంపతులు విరాళం

విశాలాంధ్ర - ధర్మవరం : పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సత్యసాయి నగర్లో గల శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో నూతనంగా శివాలయం ఆలయ నిర్మాణం కొనసాగుతోంది. ఈ ఆలయ నిర్మాణం పట్ల పలువురు దాతలు ఆలయానికి తమ సహాయ సహకారాలలో భాగంగా భక్తిగా, భక్తులుగా విరాళాలని ఇస్తున్నారు. ఇందులో భాగంగా శివాలయ నిర్మాణమునకు దాతలైన బండి వేణుగోపాల్, భార్య లక్ష్మీదేవి దంపతులు తమ వంతుగా రూ.25వేలు విరాళంగా ఆలయ కమిటీ అధ్యక్షులు వీరనారాయణ ,కార్యదర్శి రామలింగయ్య, డైరెక్టర్ సూర్య ప్రకాష్ కు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు దంపతుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, వారిని ఘనంగా సత్కరించారు.

టీడీపీ నాయకుడిని మర్యాదపూర్వకంగా కలిసిన డిఎస్పి

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ పట్టణమునందు మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావును, మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ నర్సింగప్ప, డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం మర్యాదపూర్వకంగా కలిసామని అలాగే డివిజన్ వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నదని డివిజన్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు సూచించినట్లు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని మడకశిర రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది అగ్ని ఏర్పడితే ఎలా నివారించాలి ఎలా అరికట్టాలి జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: తెదేపా ప్రభుత్వం ప్రజలకుఅన్నివిధాలా అండగా ఉంటుందని తెదేపా బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కేశప్ప అన్నారు. మంగళవారం దర్గా హొన్నూర్ లోని 96 వ బూతులో తెదేపా సభ్యత్వం పొందిన వారికి గుర్తింపు కార్డులను ఆయన పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తలు తెదేపాకు ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, ఆనంద్ ,నాగరాజు, వి ఎల్ రామాంజనేయులు, వై సంతోష్, ముక్కన్న,తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో చర్చి నిర్మాణము కొరకు పెనుకొండ ఎంపీపీ రామమోహరెడ్డి 10,000వేల రూపాయలు విరాళం అందజేశారు, ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ సాయిరాం నాయక్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-డీ. హిరేహాల్: మండలం ఎంపీపీ పవిత్ర వన్నూరు స్వామి జన్మదిన వేడుకల ను ఘనంగా నిర్వహించారు. మండలంలోని లో నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి ఎంపీపీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ వన్నూరు స్వామి, శ్రీనివాసరెడ్డి, మల్లి కర్జున, సురేష్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్కడచూసినా చెత్తే...

పట్టించుకోని అధికారులు, హాస్పిటల్స్ యాజమాన్యం

విశాలాంధ్ర-తాడిపత్రి : హాస్పిటల్స్ పరిసరాల్లో చెత్తాచెదారం,పట్టించుకోని మున్సిపల్ అధికారులు, హాస్పిటల్స్ యాజమాన్యం అని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం దేశ, రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛ్ ఆంధ్ర అంటూ పరిసరాల పరిశుభ్రత ఉండాలని, ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తూ గ్రామ స్థాయి నుండి దేశ రాజధాని వరకు పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాంటిది ఆర్టీసీ బస్టాండ్, కడప రోడ్డు, కుడి వైపు కాలనీ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రవేట్ హాస్పిటల్స్ వెనుక వైపు హాస్పిటల్స్కి సంబంధించి వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం వేస్తున్నారని పలువురు కాలనీ ప్రజలు మాట్లాడుకుంటున్నారు. దీంతో వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం నిల్వ ఉండడంతో రాత్రి సమయాలలో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధుల బారిన పడి ప్రజలు అనారోగ్యపాలై హాస్పిటల్స్కు వెళ్లి డబ్బులు వెచ్చించలేక ఆర్థికంగా, మానసికంగా చిదిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత వార్డులో సంబంధిత శానిటరీ వార్డ్ సెక్రటరీ ఉదయాన్నే కాలనీలలో తిరుగుతూ ఉంటారు. అలాంటిది ప్రైవేట్ హాస్పి టల్స్ వద్ద చెత్త వేస్తున్నప్పటికీ ప్రైవేట్ హాస్పిటల్స్ పరిసరాల వైపు ఎందుకు చూడడం లేదని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. కావున మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిన పరిశీలించి హాస్పిటల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర-పుట్టపర్తి: అగ్ని ప్రమాదాల నియంత్రణపై అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన మంగళవారం హనుమాన్ కూడలిలోఅగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా పుట్టపర్తి లో ఆర్టీసీ బస్టాండ్ నుంచి హనుమాన్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి నాగరాజు నాయక్ మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబాయిలో జరిగిన అగ్నిప్రమాదంలో 700 మంది మృత్యువాత పడ్డారన్నారు.అందులో 60 మంది వీర మరణం పొందిన వారిని స్మరించుకుంటూ ప్రత్యేక అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే 101 నెంబర్ కి సమాచారం అందిస్తే తక్షణమే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో షార్ట్ సర్క్యూట్స్ లేదా ఎండు గడ్డికి మంటలు

వ్యాపించడం వంటివి జరుగుతుంటాయని ఇలాంటి సమయంలో కొన్ని కొన్ని మెలకువలు పాటించడం వల్ల ప్రమాదాలను ఏ విధంగా అరికట్టవచ్చు వివరించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన పద్ధతులపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

విక్టరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్‌కు సన్మానం

విశాలాంధ్ర-గుంతకల్లు: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 134 వ జయంతి నీ పురస్కరించుకొని ఈ సందర్భంగా కసాపురం గ్రామంలో నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర విక్టరీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వై విజయ కుమారి, ఆధ్వర్యంలో సాయి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెడ్ డాక్టర్ ప్రభాకర్, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవాలయం వ్యవస్థాపకులు తలారి పరుశురాముడు సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీడాక్టర్ హరిప్రసాద్ యాదవ్, పౌర హక్కుల సంఘం నాయకులు ఆదినారాయణ, విక్టరీ ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీమంజునాథ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జి.పవన్ ఆంజనేయులు,మండల ఉపాధ్యక్షులు జయరాం మాదిగ, ఎమ్మార్పీఎస్ గుంతకల్ టౌన్ కార్యదర్శి జెన్నే మస్తానయ్య, కసాపురం గ్రామ ట్యూషన్ మాస్టర్ జిలకర సురేంద్ర కసాపురం గ్రామ రాజకీయ నాయకులు గంతుల లక్ష్మన్న , పూల ఆంజనేయులు , బలిజ సంఘం నాయకులు రామాంజనేయులు గ్రామ ప్రజలు మహిళలు విక్టరీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కెఎల్. స్వామి దాస్ మాదిగ ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి పురస్కరించుకొని ఈ సందర్భంగా అంబేద్కర్ లైఫ్ అచీవ్మెంట్ అవార్డు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమొంటోను అందజేసి ఘనంగా సన్మానించడం జరిగింది. సభలో విక్టరీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ డాక్టర్ విజయ్ కుమారి మాట్లాడుతూబీ అవార్డు గ్రహీత అయిన

కెఎల్.స్వామి దాస్ మాదిగ సోషల్ సర్వీస్ లో సామాజిక సేవలు అందించినందుకు అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం ప్రజాక్షేత్రంలో దాదాపుగా 30 సంవత్సరాలు, పైబడి అనేక సామాజిక ఉద్యమాలలో ఎన్నో సభలు సమావేశాలు నిర్వహించి హక్కుల సాధనకై ఉద్యమించిన నేతకు మా విక్టరీ ఫౌండేషన్ ద్వారా అతని శ్రమను గుర్తించి, కసాపురం గ్రామంలో కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన వ్యక్తి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామి దాస్ మాదిగ ఆయన కృషికి పట్టుదలను, శ్రమను గుర్తించి సమాజంలో ఇలాంటి సామాజిక సేవకులకు విక్టరీ ఫౌండేషన్ వారు అవార్డు గ్రహీతగా ఎంపిక చేసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. సన్మానం అనంతరం రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ మాదిగ మాట్లాడుతూబీ విక్టరీ ఫౌండేషన్ వారు అవార్డు గ్రహీతగా నన్ను ఎంపిక చేసినందుకు , వారు సమాజంలో సామాజిక సేవలను గుర్తించి అందిస్తున్న , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి లైఫ్ అచీవ్మెంట్ అవార్డును, మెమొంటోను నాకు ప్రధానం చేసి అందజేసినందుకు విక్టరీ ఫౌండేషన్ వారికి , ఈ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ మేధావులకు పెద్దలకు గ్రామ ప్రజలకు మహిళలకు నాతోటి సహచర మిత్ర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుచున్నాను.

విజేతలకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర-పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతరత్న, భారత రాజ్యాంగ పితామహుడు డా. బీ.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు లో భాగంగా వ్యాసరచన పోటీలు, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. కె.జయప్ప బహుమతులు

ప్రశంసా పత్రాలు అంద జేశారు, ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా కె.జయప్ప అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అంబేద్కర్ కృషి వల్ల నాటి అంటరానితనం నేటి సమాజంలో దాదాపు కనుమరుగైందని పేర్కొన్నారు. కానీ నేటి సమాజంలో ఆర్థిక అసమానతలు ఎక్కువయ్యాయని కనుక ప్రతి ఒక్క బడుగు బలహీన వర్గానికి చెందిన వ్యక్తి కష్టపడి ఆర్థికంగా, సామాజికంగా మరియు రాజకీయంగా ఎదగాలని కోరారు. అలా ఎదిగినప్పుడే అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చినట్టు అని తెలిపారు.

సీపీఆర్ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్‌కు సన్మానం

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో గత రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమిద్యాల గ్రామానికి చెందిన యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అటువైపు వెళుతున్న ఉరవకొండ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ చంద్ర సిపిఆర్ చేసి ప్రాణం కాపాడారు, ఆటో డ్రైవర్ వల్ల ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడని ప్రతి ఒక్కరు కూడా చంద్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ ఆటో డ్రైవర్ ను మంగళవారం స్థానిక జమీల్ కూలర్ షాప్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఎవరైనా ఎక్కడైనా ప్రమాదంలో ఉన్నపుడు తక్షణ సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నిరంజన్ గౌడ్, లెనిన్ బాబు, కులర్ షాప్ జమీల్, ఆపద్బాంధవ ట్రస్ట్ వేల్పుల మురళీ, విశ్వనాథ్, షకీర్, ఆరీఫు, ఆటో రాజు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ ఫైర్ స్టేషన్ అధికారి ఏ. భీమ లింగయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉరవకొండ పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో అగ్నిమాపక సిబ్బంది పలు విన్యాసాలు ప్రదర్శించారు. అగ్ని ప్రమాదం సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకునే యత్నాల ను కళ్లకు కట్టినట్లు ప్రదర్శనల ద్వారా చూపించారు. వ్యాపారస్థులు, గృహ నిర్మాణదారులు తమ సంస్థలను ఏర్పాటు చేసే ముందుగా అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారుల అనుమతులు కూడా తప్పకుండా తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందులో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సమావేశానికి తరలిరండి

విశాలాంధ్ర-కణేకల్లు: కణేకల్ మండల కేంద్రంలో బుధవారం జరిగే టీడీపీ కార్యకర్తలు విస్తృత స్థాయి సమావేశానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొనాలని టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఇంచార్జ్ ఆనంద్ రాజ్ కోరారు.మంగళవారం వారు సమావేశం జరిగే బిస్మిల్లా కల్యాణమంటపలో ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నందున ప్రతి గ్రామం నుండీ టిడిపి నాయకులు, కార్యకర్తలు, తరలి రావాలని కోరారు.. ఈ కార్యక్రమంలో చెరువు సంఘం అధ్యక్షుడు బి.టి. రమేష్, మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా, జయశీల రెడ్డి, తిప్పేస్వామి,వెంకటేశులు, కలందర్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

నార్పల్లో నేడు ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర-నార్పల: మండల కేంద్రంలో సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా హై స్కూల్ గ్రౌండ్ లోని బుధవారం ఉదయం 10:00 గంటలకు, శింగనమల నియోజకవర్గానికి మంజూరైన సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ వినోద్ కుమార్ శాసనసభ్యురాలు శ్రీ బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఈ పరికరాలను స్వయంగా అందజేయనున్నారు.